## చిన్నారి శివాన్షి పుట్టినరోజును నిర్వహించిన దాట్ల సుబ్బరాజు



**ముమ్మిడివరం, ఆగస్టు 30, ( నేటి దర్శిని )**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని ఐపోలవరం మండలం కేశనకుర్రుపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని జై బుద్ధ నగర్‌కు చెందిన చిన్నారి నేరేడిమెల్లి శివాన్షి రెండవ జన్మదిన వేడుకలను ఆదివారం శాసనసభ విప్ మరియు ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు మురమళ్ళ గ్రామంలోని ఆయన కార్యాలయంలో నిర్వహించారు. తల్లి నేరేడిమెల్లి శిరీష, తండ్రి నేరేడిమెల్లి నరేష్లతో కలిసి చిన్నారి శివాన్షికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్న వయసులోనే ప్రత్యేక ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొంటున్న శివాన్షి, తన కుటుంబ సభ్యుల ప్రేమాభిమానాల మధ్య సంతోషంగా ఎదగాలని ఆకాంక్షించారు. చిన్నారి జీవితంలో ఆనందం, ప్రేమ, ఆశలు నిండాలని, భవిష్యత్తులో ఆమె అనుకున్న ప్రతి కల నిజం కావాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రత్యేకంగా నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## రిలయన్స్ ఇండస్ట్రీస్ సహకారంతో గాడిమొగ గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**తాళ్లరేవు, ఆగస్టు 30, ( నేటి దర్శిని**
రిలయన్స్ ఇండస్ట్రీస్ సహకారంతో కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం గాడిమొగ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాకినాడకు చెందిన దృష్టి ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్న అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాడిమొగ గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, గ్రామ పెద్దలు,ప్రజలు పాల్గొన్నారు.

## కె.వి.ఆర్ అంజలి చారిటబుల్ ట్రస్ట్ చే ఇంజరం గ్రామంలో సెప్టెంబర్ 6న ఉచిత కంటి వైద్య శిబిరం






**ముమ్మిడివరం,ఆగస్టు 30, ( నేటి దర్శిని**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని తాళ్ళరేవు మండలం ఇంజరం గ్రామంలో గల కెవిఆర్ అంజలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6వ తేదీ ఆదివారం నాడు ఇంజరం గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు కాకరపర్తి వెంకటరావు,పూర్ణిమ దంపతులు తెలియజేశారు. శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి కాకినాడ వైద్యులచే నిర్వహించబడె ఈ ఉచిత కంటి వైద్య శిబిరం ఇంజరం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. శిబిరంలో పరీక్షలు చేయించుకున్న అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్ళజోళ్ళు, శస్త్ర చికిత్సలు చేయించబడతాయన్నారు. ఈ శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు జిరాక్స్ లేదా ఇతర గుర్తింపు పత్రం జిరాక్స్ తప్పనిసరిగా తీసుకురావాలని నిర్వాహకులు కోరారు.

## వేములకొండలో విద్యుత్ సమస్యకు పరిష్కారం

పాత కొత్తగూడెంలో కొత్త విద్యుత్ లైన్.. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



**వలిగొండ, ఆగస్టు 30, ( నేటి దర్శిని**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ గ్రామంలోని పాత కొత్తగూడెం ప్రాంతంలో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామపంచాయతీ సహకారంతో నూతన విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయడంతో పాటు కొత్త లైన్‌ను గుంజి, ట్రాన్స్‌ఫార్మర్‌ను నూతనంగా ఏర్పాటు చేశారు.
గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ ఏర్పుల వెంకటేశం, ఉప సర్పంచ్ అంబటి సాయికుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యుత్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వారి కృషికి స్పందించిన ఏఈ జోగుల నరసింహ, డీఈ గ్రామపంచాయతీ సహకారంతో విద్యుత్ పనులను చేపట్టారు.
ఈ పనుల్లో విద్యుత్ శాఖ హెల్పర్ నరసింహ కూడా పాల్గొని సహకరించారు. నూతన విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కావడంతో పాత కొత్తగూడెం ప్రాంత ప్రజలకు విద్యుత్ సరఫరా సమస్యలు తగ్గనున్నాయని గ్రామస్థులు తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేసిన సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు విద్యుత్ శాఖ అధికారులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## భవంగా 18 అడుగుల శివలింగం, నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠ



**ఉరవకొండ రూరల్, ఆగస్టు 30, ( నేటి దర్శిని**
: మండలంలోని రాయంపల్లి గ్రామం వద్ద శ్రీ పర్వతేశ్వరస్వామి దేవాలయం ఎదుట ఏర్పాటు చేసిన 18 అడుగుల శివలింగం, శ్రీ నందీశ్వర శిలా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి జీవసమాధి వద్ద రుద్రాభిషేకం, యంత్ర ప్రతిష్ఠ, శివలింగం, నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠ, విశేష అలంకారం, జయాది హోమం, బలిహరణ, పూర్ణాహుతి, అష్టోత్తర పూజ, మహానైవేద్యం, మహామంగళహారతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఉరవకొండ గవిమఠం సంస్థానం డాక్టర్ కరిబసవ రాజేంద్ర మహాస్వాములు, పాల్తూరు కల్లుహళ్లి మఠం సంస్థానం శ్రీ చెన్నవీర శివాచార్య మహాస్వాములు, శ్రీమాత గురుచరణానందగిరి మాతాజీ, కుక్కరచేడు గురుసేవాశ్రమం శ్రీ శంకరానందగిరి స్వాములు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## రౌడీషీటర్లకు అర్బన్ సీఐ అశోక్‌కుమార్ హెచ్చరిక

వైన్ షాపుల వద్ద అల్లర్లు, పంచాయతీల్లో జోక్యం చేసుకుంటే పీడీ యాక్ట్ తప్పదని స్పష్టం



**నందికొట్కూరు, ఆగస్టు 30, ( నేటి దర్శిని**
నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు నందికొట్కూరు పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులకు అర్బన్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీయిజాన్ని పూర్తిగా విడిచిపెట్టి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలని సూచించారు. వైన్ షాపుల వద్ద గుమిగూడి మద్యం సేవించి అల్లర్లు సృష్టించడం, దౌర్జన్యాలకు పాల్పడటం, భూ తగాదాలు, ఇతర పంచాయతీల్లో జోక్యం చేసుకుని బెదిరింపులకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి రౌడీషీటర్ ప్రస్తుతం ఏం పని చేస్తున్నాడు, జీవనోపాధి ఎలా సాగిస్తున్నాడనే వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సత్ప్రవర్తనతో జీవిస్తూ కుటుంబాన్ని పోషించుకోవాలని హితవు పలికారు. పోలీసుల హెచ్చరికలను పెడచెవిన పెట్టి తిరిగి నేరాలకు పాల్పడితే నిరంతరం నిఘా ఉంచుతామని తెలిపారు. అవసరమైతే పీడీ యాక్ట్, బైండోవర్ కేసులు నమోదు చేసి జైలుకు పంపడంతో పాటు రౌడీషీట్లను కొనసాగిస్తామని సీఐ అశోక్‌కుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో అర్బన్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంతంగా నీట్--పీజీ 2026 పరీక్ష

**-జిల్లాలో 7 కేంద్రాలు.. 98.72 శాతం హాజరు**



**కర్నూలు రూరల్ ఆగస్టు 30, ( నేటి దర్శిని**
కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ జిల్లాలో నీట్--పీజీ 2026 ఆన్‌లైన్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో ఏర్పాటు చేసిన ఏడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 2,114 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 2,087 మంది పరీక్షకు హాజరయ్యారు. 27 మంది గైర్హాజరుకాగా, 98.72 శాతం హాజరు నమోదైంది. స్థానిక పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, కె.వి.సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరుతో పాటు అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షను సజావుగా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించినట్లు తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. హాల్‌టికెట్ల తనిఖీతో పాటు ఇతర నిర్దేశిత విధానాలను సమర్థవంతంగా అమలు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వైద్య సహాయం, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ వివరించారు. అధికారులు సమన్వయంతో పనిచేయడంతో పరీక్ష ప్రశాంత వాతావరణంలో ముగిసిందన్నారు. కార్యక్రమంలో కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# నందికొట్కూరులో పోలీసుల మెరుపు దాడి

**-40 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం..**

**-20 లీటర్ల నాటుసారా స్వాధీనం**



**నందికొట్కూరు, ఆగస్టు 30, ( నేటి దర్శిని**
నందికొట్కూరు పట్టణంలోని శికారిపేటలో నాటుసారా తయారీ జరుగుతోందన్న సమాచారంతో పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పట్టణ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 40 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అదే ప్రాంతానికి చెందిన శికారి రాజు వద్ద విక్రయానికి సిద్ధంగా ఉంచిన 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు శికారి రాజుపై ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నందికొట్కూరు పట్టణంలో నాటుసారా తయారీ, విక్రయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఎవరైనా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ అశోక్‌కుమార్ హెచ్చరించారు. భవిష్యత్తులోనూ నాటుసారా తయారీ, విక్రయాలపై దాడులు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం నిర్వాసితులకు జీవో 98 ప్రకారం ఉద్యోగాలివ్వాలి




**నందికొట్కూరు, ఆగస్టు 30, ( నేటి దర్శిని**
శ్రీశైలం నీటిముంపు నిర్వాసిత కుటుంబాలకు జీవో నెం.98 ప్రకారం ఇంటికొక ఉద్యోగం కల్పించాలని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఈ సమస్యను నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఆదివారం నందికొట్కూరులో 158 రోజులుగా కొనసాగుతున్న శ్రీశైలం నీటిముంపు నిరుద్యోగుల రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం జై కిసాన్ పార్క్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతూ.. 1986లో ఎన్టీఆర్ జారీ చేసిన జీవో 98 ప్రకారం ఇంకా 674 మందికి ఉద్యోగాలు రావాల్సి ఉందని తెలిపారు. నాలుగు దశాబ్దాలు గడిచినా జీవో అమలు కాకపోవడం బాధాకరమన్నారు. జీవో 98 అమలయ్యే వరకు నిరుద్యోగులు చేపట్టే ప్రతి ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని వెంకటస్వామి ప్రకటించారు. నంద్యాల ఎంపీగా బైరెడ్డి శబరి ప్రజా సమస్యలపై పార్లమెంటులో గళమెత్తుతున్న తీరు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సమస్యను కూడా పార్లమెంటులో ప్రస్తావించి నిర్వాసిత నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిరుద్యోగ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

